సందర్భం

# సమరాహ్వానం నుంచి స్వర్గ భైరవం దాకా ...



Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org

**తొ**లుదొలుత కవిత్వం రాస్తున్న ఆరంభ రోజుల్లో ఆ కుర్రాడు, ధృతరాష్ట్రుడు కోరినట్టుగా 'దివ్యలోచనములు ప్రసాదింపుమయ్య' అన్నది పద్యంలో నాలుగో పంక్తిగా రాసిన కవిత, తమ పత్రిక 'స్వశక్తి'లో అచ్చు వేసినవారు పురిపండా అప్పలస్వామి. ఈ కారణం వల్లే తాను శ్రీశ్రీ డిస్కవరర్ అని చెప్పేవారు పురిపండా. 'అది నిజమే! నా కవిత మొదట అచ్చు వేసింది ఆయనే' అని జవాబు చెప్పేవారు శ్రీశ్రీ. భారత ఇతివృత్తాలు అందరూ కవుల్లాగే శ్రీశ్రీగా ఎదుగుతున్న ఆ బాలకవికి కూడా బాగా ఇష్టమే! అందుకే 'దివ్యలోచనములు' కవిత కేవలం జ్ఞాపకం కాగా, తన పదిహేనో ఏట శ్రీరంగం శ్రీనివాసరావు రాసిన 'సమరాహ్వానము' కవిత, అప్పటి మేటి పత్రిక భారతిలో నవంబర్ 1926 సంచికలో అచ్చయింది. ఇది నిజంగా శ్రీశ్రీగా ఎదగడానికి ఆ కుర్రాడికి మొదట్లోనే దొరికిన యోగ్యతాపత్రంగా భావించవచ్చు.

పురిపండా కేవలం శ్రీశ్రీ తొలి పద్యం అచ్చు వేసిన సంపాదక మిత్రులే కాదు, శ్రీశ్రీ కవితల తొలి సంపుటి 'ప్రభవ' ప్రచురణకర్త కూడా. 1928లో ఈ సంపుటి తెచ్చిన సమయానికి శ్రీశ్రీ పద్దెనిమిదేళ్ళ తరుణ వయస్కుడైతే- అచ్చు వేసిన పురిపండాకు ఇరవై నాలుగేళ్లు. ప్రభవలో మొదటి కవిత 'సమరాహ్వానము'. తెలుగు సంవత్సరాల్లో మొదటిదైన ప్రభవ పేరిట వెలువడ్డ ఆ అరవైఏళ్ల కాలచక్రంలో శ్రీశ్రీ తిరుగులేని ప్రపంచస్థాయి కవిగా నిలిచిపోయే ప్రయాణం చేశాడు అంటే, ఇందులో పచ్చజెండా ఊపిన పురిపండా పాత్ర కూడా ప్రముఖమే! 1927 - 28 తెలుగు కాలమానం ప్రకారం 'ప్రభవ' నామ సంవత్సరమే! శ్రీశ్రీ తొలి సంపుటి పేరును వీళ్ళు ఎంత జాగ్రత్తగా పెట్టారో ఈ అమరిక చూస్తే తెలుస్తుంది. అలా ఒక ప్రభవలో రాయగా, విభవ చైత్రంలో (ఏప్రిల్, 1928) అచ్చులో కవితా సంపుటి గల కవిగా మొదలైన జీవితం- నిరంతర కవిత్వ వ్యాసంగంతో నడిచింది, 1983-1984 రుధిరోద్గారి నామ సంవత్సరంలో 1983 జూన్ 15న ఒక సూర్యాస్తమయ వేళ శాశ్వత విశ్రాంతి వరకూ. భారతి 1926 సంచికలో సమరాహ్వానం అచ్చయిన సంవత్సరం అక్షయ. అక్షయమైన కవిత్వ రాశిని వదిలి వెళ్ళే విలువైన అవకాశాన్ని, కాలంతో పాటు పరుగులు తీస్తూ.. రెండు చేతులా సద్వినియోగం చేసుకున్న ధూమకేతువు శ్రీశ్రీ.

భారతాంతర్గత పద్యాలుగా, పురాణ ఇతివృత్తాలతో 'ప్రభవ'లో ఉత్తర కుమారుడు, మృత్యువు, ప్రేమ, కృష్ణరాయలు, పెద్దన, విశాఖ సముద్ర ఏడమర ఆకాశ నాయింకుంకుమ, తేటగీతాల పట్ల తనకు గల దిట్టమైన ప్రేమ... ఇలా ప్రభవ, శ్రీశ్రీ కవితలే కాక, రెండు అనువాదాలతో కూడా వెలువడింది. షేక్స్పియర్ గీతం, ఇనోనీ పేరిట ఆంగ్ల మహాకవి టెన్నిసన్ గ్రీకు సుందరి ఇనోనీ తన ప్రియుడు పారిస్ జీవితంలో సంభవించే ఘట్టాలకు సాక్షిగా రాసిన ప్రేమ విషయ కవితకు శ్రీశ్రీ అనువాదం ప్రభవలో మనలను పలకరిస్తాయి. ప్రభవలో ఉన్న లలిత భావ కళా వియద్వాహిని ఒక మలుపు తిరిగిన కవిత సుప్తాస్థికలు. జీవన కటు మురళీ రవళి కూడా తన ఊహల రెక్కలపై బరువుగా నిలుస్తుందని శ్రీశ్రీ తన ఇరవయ్యో ఏట చెప్పిన కవిత ఇది. 1930- 31 ప్రమోదూత సంవత్సరాది సంచికలో సమదర్శిని పత్రికలో ఇది అచ్చయింది.

'నాకుగాదులు లేవు నాకుషస్సులు లేవు' అన్న భావ శబలత పదేళ్ళ ముందర కృష్ణశాస్త్రికి అలంకారమైనది, కేవలం దశాబ్దం కాలంలోనే శ్రీశ్రీ స్వరంలో ఒక ఉగాది జీవన సమదర్శన పునాది అయింది. రాజాస్థానాల నుంచి విడివడిన కవిత్వం, దేశి రూపాలెత్తి భక్తి పేరిట శృంగారంలో గంగవెర్రులెత్తిపోయి, అక్కడ నుంచి శతకకర్తలు ఎంత మందలిస్తున్నా, స్త్రీ శరీరంపై కచాకచి, బాహాబాహీ భావ ప్రకటనల జీవనోపాధుల వక్రగతిలో పూర్తిగా పతనం అయి, క్షీణ ప్రబంధదశలో ఉండగా, వచ్చిన తొలి స్వరధార కందుకూరి వీరేశలింగం దూసిన సరస్వతీ నారద విలాపము. ఆ రాజాస్థానాల నుంచి జీవన మహా ప్రస్థానాల దాకా కవిత్వ ప్రక్షాళిత యాత్రలో, ఆ కొమ్ము బోయీ శ్రీరంగం శ్రీనివాసరావు. సుప్తాస్థికలు కవిత, ఆయన కవిత్వ విస్ఫోటం ముందు వచ్చిన పెనుగాలి హెచ్చరిక.

1932 ఉగాది అంగీరస సంవత్సరం. శ్రీశ్రీ ఇక్కడి తేటగీతి దివ్యానుభూతి. 1933 అంటే, శ్రీశ్రీ మహాప్రస్థాన తొలిగీతం జయభేరి రాసిన మరుసటి సంవత్సరం. ఈ అంగీరస ఆరంభంలో మహాప్రస్థాన సంకల్పం చెప్పుకున్నాడా యువ విరాట్టు. అవును.. ఇదిగో ఆంధ్ర పత్రిక సంవత్సరాది సంచికలో అచ్చయిన ఆ తేటగీతి ఇలా ముగుస్తుంది.

'ఇపుడు మేఘములు
విచ్చిపోయినవి నాకు
గగనమందె కలదు తారకావ్రజమ్ము
ఇంకా నే రాకా శశాంక మూర్తి
నై నభోరాజ్య పాళికలావరింతు'

శ్రీముఖ సంవత్సరం వచ్చిన వచ్చిన మూడు నెలలకు 2.6.1933న 'జయభేరి' కవిత రాశాడు శ్రీశ్రీ. ఇదే నిజానికి మహాప్రస్థాన గీతాల్లో తొలి రచన. అయితే, ఏప్రిల్ 1934లో (మళ్ళీ ఉగాది గొడవ తప్పదు) భావ నామ సంవత్సరంలో, తెలుగు సాహిత్యం నుంచి ప్రపంచ సమాజానికి ఒక శ్రీముఖం పంపించాడు శ్రీశ్రీ.. అదే మహాప్రస్థానం గీతం. మరో ప్రపంచం, మహా ప్రపంచం పిలుస్తున్న పిడుగుపాట. నిజానికి 1933 జూన్, 1934 ఏప్రిల్ మధ్య కాలంలో శ్రీముఖ ఏడాదిలోనే (జయభేరి, మహాప్రస్థానం) గీతాలు రాసిన తొమ్మిది నెలల కాలంలోనే మరికొన్ని కవితా శిశువులు కూడా వెలువడ్డాయి. వాటిలో ముఖ్యమైనది, మహాప్రస్థానం కవితా సంపుటిలోకి రానిది 'బాల్యం'. అది కల్యాణి పత్రికలో అక్టోబర్, 1933లో అచ్చయింది. ఏప్రిల్ 1934 కాలానికి యువ శ్రీశ్రీ విస్తృతంగా రాస్తున్నాడు. 'గంటలు' అనేది అనువాదం కాదు అంటూనే ఎడ్గార్ ఎలెన్ పో పేరు చెప్తూ అతని కవిత 'ది బెల్స్' తెలుగులో పరిచయం చేశాడు. ఆకాశ దీపం, మార్చి 1934లో, ఋక్కులు, అవతారం రెండు కవితలూ ఒకే రోజు ఏప్రిల్ 14నే రాశాడు. 'కవితా ఓ కవితా!' గీతం వెలువడ్డ 1937 ఈశ్వర నామ సంవత్సరం. శ్రీశ్రీ దర్శించి, విశాల లోకానికి దర్శింపచేసిన కవిత్వేశ్వర తత్వం ఈ గీతంలో ప్రత్యక్షం అవుతుంది. ఈ సంవత్సరంలో ఏకంగా ప్రఖ్యాతమైన ఎనిమిది మహాప్రస్థాన గీతాలు శ్రీశ్రీ రాశాడు. (కవితా ఓ కవితా, మిథ్యావాది, వాడు, అభ్యుదయం, వ్యత్యాసం, ప్రతిజ్ఞ చేదుపాట, నవకవిత).

శ్రీశ్రీ మహాప్రస్థాన సంపుటి అచ్చయిన 1950 వికృతి నామ సంవత్సరం. అచ్చు కావడానికి దశాబ్దంన్నర ముందునుంచే ప్రఖ్యాతి పొందినా, 1950 వరకూ, మహాప్రస్థానం సంపుటిగా వెలుగులోకి రాలేదు. ఈలోగా, శ్రీశ్రీ తెలుగు కవుల్లోనే ప్రపంచ సాహిత్యం నుంచి అత్యధిక అనువాదాలు చేసి, తెలుగు సాహిత్యలోకానికి లోకపు వెలుగుల కిటికీలు తెరిచాడు. అందుకు ప్రధాన ఆధారం, ఆయన మూడో కవితా సంపుటి ఖడ్గసృష్టి. 1966 ఫిబ్రవరి అంటే విశ్వావసు నామ సంవత్సరంలో వచ్చింది. 'మైలమ భీమన ఖడ్గసృష్టికిన్' అని అంకితం ఇచ్చారు శ్రీశ్రీ. అటు అనువాదం, ఇటు ఆధునిక వచన కవిత్వం రెండంచుల పదును గల సంపుటి ఇది.

శ్రీశ్రీకి ఉగాది కవితలు అంటే ఇష్టమా? అంటే ఒక ప్రభవ ఉగాది నాడు తెలుగు కవిగా బొడ్డుకోత జరిగి ప్రవేశించిన అక్షరధీరుని ప్రస్థానంలో ఎక్కువ ఉగాది ప్రస్తావనలు, వారి మరణానంతర సంపుటిగా వెలువడ్డ మరో ప్రస్థానంలో కనిపిస్తాయి. ఉగాది పేరిట కవితల్లో వారు సమకాలీన రాజకీయ ప్రస్తావనలు చేశారు తన సహజ స్వభావానికి అనుగుణంగా. సాధారణ ఉగాది పచ్చడి, ఉగాది స్వగతాలు, రాక్షస ఉగాది, మట్టిపులి, పంచరత్నాలు, ఉగాది గీతం... ఇలా భిన్న ఉగాదులకు సాధారణ, కాళయుక్తి, నల, దుంధుభి, రాక్షస సంవత్సరాల్లో స్పందిస్తూ శ్రీశ్రీ రాసిన ఉగాది గీతాల కోటా మరో ప్రస్థానంలో ఎక్కువే కనిపిస్తుంది.

సినిమా పాటల విషయంలో కూడా మరో ప్రపంచం పాట - 1940లో విక్రమ నామ వత్సరంలో బందా కనకలింగేశ్వరరావు కోరస్ పాడిన గీతం కాగా, 1950లోనే శ్రీశ్రీ పాట డబ్బింగ్ 'హంస వలె నా పడవా' ఆహుతి సినిమాతో మొదలు శ్రీశ్రీ సినీకవితా ప్రస్థానం కూడా. సినీ కవిగా తన ఇన్నింగ్స్ మొదలైన ఏడాది అది వికృతి నామ వత్సరం. ఒక ప్రభవలో కవిగా మొదలై, అరవై ఏళ్ల సృజన కాలచక్రంలో 1983 దాకా విజయదుంధుభులు మోగించి, 1983 రుధిరోద్గారి నామ సంవత్సరంలో జూన్ 15, 1983న విశ్రాంతి తీసుకున్న కవిత్వ గండ భేరుండం, కవిత్వ గంధ మాదనం, ఎరుపు వన్నెలో కవిత కవితకో ఛాయ చూపిన సిందూర మందార తూర్పు పడమరల ఆకాశం- శ్రీశ్రీ. వారి మొదటి గీతం సమరాహ్వానం కాగా, చిన్న చిన్న రచనలు వదిలిపెడితే, ఆఖరుగా రాసిన పెద్ద రచన స్వర్గ భైరవం. 'నరకలోకపు జాగిలమ్ములు' అన్న 1934 నుంచి అవతారం దాల్చి 1893లో ఫ్రాన్సిస్ థాంప్సన్ రాసిన 'హౌండ్ ఆఫ్ హెవెన్' (గూటాల కృష్ణమూర్తి గారి కోరిక మేరకు) 'స్వర్గ భైరవం' పేరిట చేసిన అనువాదం దాకా, అటు పై ఓటో రెని కాస్టిల్లో అనే లాటిన్ అమెరికన్ గాటెమాలా కవి రచనలు రెండు చేసినా, క్షణమైనా ఆగని ఒక యాభై అయిదేళ్ళ అక్షర వ్యోమయాత్ర శ్రీశ్రీది. అక్షయ భావ నిధులు మనకి ఆస్తిగా వదిలి వెళ్లిన మహత్వ కవిత్వ పటుత్వ సంపదల సమృద్ధ ఖని శ్రీశ్రీ. శ్రీశ్రీ ఉగాదులు సమాజ ఉషస్సులు.

**(ఏప్రిల్ 30 : శ్రీశ్రీ జయంతి)**

**- రామతీర్థ**
**98492 00385**

Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org